



సామూహిక దీక్షలో పాల్గొన్న విఒఎలు

విఒఎలను విధుల్లోకి తీసుకోండి

కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

తొలగించిన వెలుగు విఒఎలను వెంటనే విధుల్లోకి తీసుకుని, బకాయి పడ్డ ఆరు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సామూహిక నిరాహార దీక్షలు చేపట్టారు. సోమవారం కలెక్టరేట్ గేటు ముందు ఈ దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చి రెండు నెలలు అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. బకాయి ఆరు నెలలు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో విఒఎల కుటుంబ జీవనం కష్టం అయ్యిందన్నారు. డిసెంబర్ 16న వెలుగు సెర్ప్ సీఈవో యూనియన్ నాయకులతో పండుగలోపు బకాయి వేతనాలు చెల్లిస్తామని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నా న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక నిరాహార దీక్షలకు వీవోవోలు సిద్ధమయ్యారన్నారు. వెంటనే విఒఎలను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు రోజులపాటు ఈ దీక్షలు కొనసాగుతాయని ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు బ్యాళ్ల అంజి, ముత్యాలు, మద్దతు తెలిపిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరశేషు, ప్రధాన కార్యదర్శి నాగార్జున, పవన్ కుమార్, విఒఎలు ఆదినారాయణ, శకుంతల, సుభాషిని, గంగమ్మ, మాధవి, సునీత, రామాంజనేయులు, మల్లప్ప, నాగరాజు పాల్గొన్నారు.

కలహాల కుంపటి..!



శింగనమల టిడిపి కలహాల కుంపటిలా మారింది. ఇక్కడ ప్రత్యర్థి పార్టీల నుంచి ఇబ్బందుల్లేవు. టిడిపి అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ఆ పార్టీ నేతల మధ్య కయ్యాలు నడుస్తున్నానే ఉన్నాయి. ఎమ్మెల్యే బండారు శ్రావణి, నియోజకవర్గంలోని ముఖ్య నేతల మధ్య ఈ కలహాలు తారా స్థాయిలో కన్పిస్తున్నాయి. రోజురోజుకు వివాదాలు ముదురుతుండడం ఆపార్టీకి కొత్త చిక్కులను తెస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బండారు శ్రావణిశ్రీ ఉన్న సమయంలోనే నేతల మధ్య పొసగలేదు. అప్పట్లో ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి ఆమెను తప్పించి టుమెన్ కమిటీని వేశారు. ఎన్నికల వరకు టుమెన్ కమిటీయే పార్టీ కార్యక్రమాలను నియోజకవర్గంలో చేపడుతూ వచ్చింది. ఎన్నికల సమయంలోనూ బండారు శ్రావణి అభ్యర్థిత్వాన్ని టుమెన్ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ సమయంలో అధిష్టానం వీరి మధ్య సయోధ్యను కుదిర్చి ఎన్నికల్లో పనిచేసే విధంగా ప్రయత్నించింది. ఎన్నికల్లో బండారు శ్రావణి ఎమ్మెల్యేగా గెలుపొందారు. గెలుపొందాక కూడా నియోజకవర్గంలో ముఖ్య నేతలతో సయోధ్య లేదు. పనులు జరిగే విషయంలో తరుచూ వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. వీటి నడుమ కొన్ని కార్యక్రమాలు కూడా ఎక్కడివక్కడే ఆగిపోయాయి. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో రేషన్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులు జరిగాయి. ఇక్కడ కొన్ని మండలాల్లో ఈ మార్పులు కూడా చేయలేకపోయారు. పాత వారిని వద్దని, కొత్త వారిని నియమించే విషయంలో నేతల మధ్య భిన్నాభిప్రాయాలు నెలకొనడంతో ఎక్కడివక్కడే ఆగిపోయాయి. అధికారం వస్తూనే తమకు ఈ బాధ్యతలు తీసుకోవచ్చునని ఆశించిన కార్యకర్తల ఆశలు నెరవేరలేదు. ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఉంటుండటంతో అధికారం వచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని కొంత మంది టిడిపి కార్యకర్తలు బాహాటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సోషల్ మీడియాలో ప్రచారాలు

శింగనమల నియోజకవర్గం టిడిపికి సంబంధించి ప్రతి అంశం సోషల్ మీడియాలో హల్ చేసేస్తున్నాయి. నియోజకవర్గంలో ముఖ్య నేతలను కార్యకర్తలు ఎవరైనా కలిసేందుకు వెళ్తే మొబైల్ ఫోన్లను ముందస్తుగ బయట పెట్టి రావాలని ఆదేశిస్తున్నారు. ముఖ్య నేతలను కలిసేందుకు వెళ్తే మొబైల్ ఫోను గది బయట డిపాజిట్ చేసి వెళ్లి కలిసి పనులేమైనా ఉంటే చర్చింకుని వచ్చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో మట్టి, ఇసుక విషయంలోనూ పరస్పరం వివాదాలు నడుస్తూనే ఉన్నాయి. ఒకరు తోలుకుంటే మరొకరికి నచ్చడం లేదు. పరస్పరం అడ్డుకునే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఆడియో ఒకటి బయటకొచ్చింది. అదే విధంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి వ్యక్తిగత సహాయకుడి ఆడియో బయటకొచ్చింది. ఈ నేపథ్యంలో బండారు శ్రావణి ఒక ప్రకటన విడుదల చేయడం గమనార్హం. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని చెబుతూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలా నియోజకవర్గంలో ముఖ్య నేతలు, ఎమ్మెల్యేకి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. వీరి పోరులో సామాన్య కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నలిగిపోతున్నారు. తమ బాధలు, కష్టాలేవైనా ఉంటే ఎవరితో చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లోనున్నారు.

◆ శింగనమల సైకిల్‌లో విభేదాలు

◆ ఎమ్మెల్యే శ్రావణి, నేతల మధ్య కుదరని సయోధ్య

◆ ఇరకాటంలో కార్యకర్తలు

వినతులపై నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వివిధ సమస్యలపై ప్రజల అందించే అర్జీలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 196 వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి, ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇస్తున్నారని తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీల వినతులను వచ్చే వారంలో పరిష్కరించాలని వాటిపై అధికారులు తగు నివేదికలు సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జిఎం.నాగరాజు, పట్టు పరిశ్రమల శాఖ ఏడీ పద్మావతమ్మ, సిపిఒ విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకట రమణారెడ్డి, ల్యాండ్ సర్వే ఏడీ విజయశాంతి బాయి, గిరిజన సంక్షేమ అధికారి మోహనరావు పాల్గొన్నారు.

వసతిగృహం ఘటనపై ఎమ్మెల్యే ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

చెన్నేకొత్తపల్లి బిసి హాస్టల్‌లో ఆదివారం జరిగిన ఘటనపై స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం సాయంత్రం బిసి బాలుర, ఎస్సీ బాలికల వసతిగృహాలను పరిశీలించారు. మొత్తం వసతిగృహంలో ఉన్న సౌకర్యాలను, విద్యార్థులుండే ప్రతి గదిని పరిశీలించారు. టాయిలెట్స్, వంటశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులను పస్తులు ఉంచి ఇబ్బందులకు గురి చేస్తే.. మీరు కూడా పస్తులు ఉంటారని అధికారులను అలాగే స్థానికులతో కూడా సమావేశమై పలు అంశాలు తెలుసుకున్నారు. బీసీ హాస్టల్ వార్డెన్ నారాయణస్వామి సరిగా విధులకు హాజరుకావటం లేదనిపిల్లలకు వచ్చే బడ్జెట్ ను సరిగా ఖర్చు చేయడం లేదని ఫిర్యాదు చేశారు. తాగునీరు గొల్లపల్లి నుంచి వస్తాయని.. స్నానానికి గదుల సమస్య ఉందని అన్నారు. అలాగే టాయిలెట్స్ లేక నిచ్చెన వేసుకొని కాంపౌండ్ బయటకు వెళ్తామని విద్యార్థులు ఎమ్మెల్యే ముందు వాపోయారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ వసతిగృహంలో ఆదివారం జరిగిన సంఘటన చాలా బాధాకరమన్నారు. వార్డెన్ పిల్లల్ని ఆకలితో ఉండేలా చేయడం సరైంది కాదన్నారు. ఇంత నిర్లక్ష్యం వహించిన వార్డెన్ పై సస్పెన్షన్ వేటు వేసినట్టు వివరించారు. ఒక విద్యార్థికి ఒక నెలకు 14వందలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. వార్డెన్ సరుకులు కొనుగోలు చేసి మెను ప్రకారం టిఫిన్, భోజనం చేయించాలన్నారు. వార్డెన్ లేనప్పుడు మరొక వార్డెన్ ఇన్ ఛార్జి గా ఉండాలన్నారు. లేదా పిల్లలకు ఎలాంటి సమస్య రాకుండా వంట వారితో సమన్వయం చేసుకోవాలన్నారు. అలా కాకుండా నారాయణ స్వామి నిర్లక్ష్యం వహించారన్నారు. వసతిగృహంలో భవనం కూడా దెబ్బతినిందని చాలా చోట్ల మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం సుమారుగా 40 లక్షల రూపాయలు ఖర్చవుతుందని దీనిపై ఇప్పటికే బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు విజ్ఞప్తి చేశామని వివరించారు. మరోసారి దీనిపై మాట్లాడి నిధులు వచ్చేలా చూస్తామన్నారు. జిల్లా కలెక్టర్ తాత్కాలిక మరమ్మతులకు 10లక్షల వరకు మంజూరు చేస్తామని తెలిపారని, విద్యార్థులకు ఇబ్బందిగా ఉన్న టాయిలెట్స్, ఫ్యాన్ల మరమ్మతులను వెంటనే చేయిస్తామని చెప్పారు. అనంతరం ఎస్సీ బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. హాస్టల్ లైట్లు సరిగా పని చేయలేదని గమనించిన ఆమె వెంటనే కొత్త లైట్లు తెప్పించాలని మండల కన్వీనర్‌కు సూచించారు. తాజాగా చెన్నేకొత్తపల్లి ఎస్సీ బాలికల వసతిగృహం మరమ్మతులకు రూ. 33.80లక్షలు, ఎస్సీ బాలుర వసతిగృహానికి రూ. 32.40లక్షలు మంజూరు అయ్యాయనివీటితో భవనాల మరమ్మతులు చేపడతామని అన్నారు.



సమస్యను వివరిస్తున్న రైతు దంపతులు



న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితరైతు

కలెక్టరేట్ వద్ద ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

తమ సమస్యలు పరిష్కారం కావటం లేదన్న కారణంతో ఇద్దరు రైతులు కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ముదిగుబ్బ మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన రైతు బ్యాళ్ల పెద్దన్న తన భార్యతోపాటు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు. అధికారుల ఎదుట ఆత్మహత్యకు పాల్పడదామన్న కారణంతో పురుగుల మందు వెంట తెచ్చుకున్నారు. అయితే పోలీసులు బ్యాగును తనిఖీ చేయగా పురుగుల మందు బయటపడింది. అలాగే పరిగి మండలం గురువనహళ్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ అను రైతు బ్యాగులో పెట్రోల్ తెచ్చుకున్నాడు. కలెక్టరేట్ బయటే పెట్రోల్ పోసుకోవడానికి ప్రయత్నించాడు. సకాలంలో పోలీసులు అప్రమత్తమై అతని ప్రయత్నాన్ని విరమింపజేశారు. రైతుల ఆత్మహత్య ప్రయత్నాలను విరమింప చేసిన పోలీసులు వారిని జాయింట్ కలెక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. భూ తగాదాల వల్ల ఈ పనికి పూనుకున్నట్లు ఆ రైతులు జెసికి వివరించారు. ముదిగుబ్బ మండలానికి చెందిన రైతు బ్యాళ్ల పెద్దన్నకు ఆయన తమ్ముడు పుల్లప్పకు మధ్య భూ తగాదాలు ఏర్పడగా, ఆ కేసు ధర్మవరం ఆర్డీవో దగ్గర ఉంది. దీనిపై ఇటీవలనే ఆర్డీవో తగిన ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిసింది. అన్నదమ్ముల సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు ఆ రైతుకు హామీ ఇచ్చి పంపారు. పరిగి మండలానికి చెందిన రైతు సోమశేఖర్ తనకు చెందిన భూమిని తమ గ్రామ విఆర్ఒ ధనుంజయ తన తమ్మునికి పట్టా ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నాడని బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

'పురం' మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్



డిఇ.రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

అదిగో, ఇదిగో అంటూ ఊరించిన హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 30వ తేదీన చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, ఫిబ్రవరి 3వ తేదీన చైర్మన్‌ను ఎన్నుకోవాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించారు. కాగా మున్సిపల్ సాధారణ ఎన్నికల సమయంలో హిందూపురం మున్సిపాలిటీలో మొత్తం 38 వార్డులు ఉండగా అప్పట్లో వైసిపి ఏకంగా 30 స్థానాల్లో గెలుపొందగా ఆరు స్థానాల్లో తెలుగుదేశం, చెరొకటి వార్డుల్లో బిజెపి, ఎంఐఎం అభ్యర్థులు విజయం సాధించారు. అప్పట్లో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో బీసీ వర్గానికి చెందిన ఇంద్రజను మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నుకున్నారు. అయితే గత ఎనిమిది నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో హిందూపురం మున్సిపాలిటీలో కూడా కౌన్సిలర్లు పార్టీ మారారు. ఏకంగా 10 మంది వైసిపికి చెందిన కౌన్సిలర్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరారు. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితమే మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వస్తుందని భావించిన అధికార పార్టీ నాయకులు కౌన్సిలర్లను క్యాంపు పేరిట ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఈ క్రమంలో వరుసగా మూడు సమావేశాలు నిర్వహించకపోవడం, మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు తదితర వాటికి కౌన్సిల్ ఆమోదం అవసరం ఉండడంతో పరిపాలన సౌలభ్యం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా వైసిపికి చెందిన వైస్ చైర్మన్ బలరామిరెడ్డిని మున్సిపల్ డెలిగేట్ చైర్మన్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం 38 స్థానాలకు గాను మున్సిపాలిటీలో 24 స్థానాల్లో కూటమి అభ్యర్థులు మెజార్టీలో ఉండగా ఎమ్మెల్యే, ఎంపీ ఓటుతో తెలుగుదేశం పార్టీకి 26 సంఖ్యాబలంతో స్పష్టమైన ఆధిక్యత ఉంది. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పావులు కలిపి వైసిపి కౌన్సిలర్లను టిడిపి వైపు తిప్పుకోవడంలో సఫలీకతులయ్యారు. ఈ నేపథ్యంలో ఆరో వార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్, టిడిపి నాయకులు డిఈ రమేష్ కుమార్ ను మున్సిపల్ చైర్మన్ చేయాలని ఆ పార్టీ నాయకులు పావులు కదుపుతున్నారు. ఎలాంటి అడ్డంకులు లేకపోతే రమేష్ కుమార్ ఎన్నిక లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇకపోతే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చైర్మన్ ఎన్నికకు స్థానిక మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 30వ తేదీన కౌన్సిలర్లతోపాటు ఎక్స్ అఫీషియో సభ్యులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఫిబ్రవరి 3వ తేదీన నిబంధనల మేరకు చేతులెత్తే పద్ధతి ద్వారా చైర్మన్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాలతో ఆయన వ్యక్తిగత కార్యదర్శి తమ పార్టీ కౌన్సిలర్లను కాపాడుకోవడంపై దృష్టి సారించారు. అన్ని సజావుగా జరిగితే మున్సిపల్ చైర్మన్ గా డిఇ రమేష్ కుమార్ ఎన్నిక లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

30న ప్రత్యేక సమావేశం

ఫిబ్రవరి 3న చైర్మన్ ఎన్నిక

డిఇ రమేష్ ఎన్నిక లాంఛనమే

రుణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం


ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం నుండి రుణాలు పొందేందుకు హిందూపురం రూరల్ మండలానికి 65 యూనిట్లు మంజూరైనట్లు హిందూపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరస్వతి తెలిపారు. ఇందులో బీసీ కార్పొరేషన్ ద్వారా 41 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కు పది యూనిట్లు మంజూరు కాగా ఇతరులకు 14 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇతరుల కింద ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య కులాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్ లైన్ లో చేసుకోవాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. దరఖాస్తుదారుడు ఏపీఓబి ఎంఎంఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన అనంతపురంలో నారాయణ జూనియర్ కళాశాలను వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేశ్, ప్రధాన కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ ఫీజులు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి తేవడంతో సత్యసాయి జిల్లాలోని బత్తలపల్లి మండలానికి చెందిన కిరణ్ అనే విద్యార్థి రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఒక విద్యార్థి నిండు ప్రాణాలు పోవడానికి కారణమైన ఆ కాలేజీని తక్షణమే ప్రభుత్వం సీజ్ చేయాలని, ఆ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, పవన్ కుమార్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఎఎస్ఐఎ జిల్లా అధ్యక్షులు శివ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న నాయకులు

న్యాయం చేయండి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని ధన రోడ్ వెంకటేశ్వర కాలనీలో తమకు సర్వ హక్కుల గల భూమిని కొంతమంది దౌర్జన్యం చేసి కబ్జా చేయాలని పూనుకున్నారని ఈ విషయంతో తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈసందర్భంగా బాధితులు రుక్మందా, డి గంగాధరప్ప అమాట్లాడుతూ వెంకటేశ్వర కాలనీ లో ఉన్న సర్వేనెంబర్ 373 -1 ఏ పైకి ఉప్పర గోవిందప్ప నుండి 27- సెంట్లు రుక్మాంద కొనుగోలు చేసినట్లు తెలిపారు, ఇదేవిధంగా ఇదే సర్వే నెంబర్లో ఉప్పర గోవిందప్ప నుండి 17 సెంట్లు భూమిని గంగాధరప్ప కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆ భూమి తమ ఆధీనంలో ఉందని ఆ స్థలానికి మున్సిపాలిటీ కి కాళీ జాగా పన్నులు కూడా చెల్లించామని చెప్పారు. ఇప్పుడు కూడా పన్నులు కడుతున్నామన్నారు. అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు ఈ భూమి తనదంటూ దౌర్జన్యం చేసి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా సోమవారం అనంతపురానికి చెందిన వ్యక్తి దాదాపు 100 మందికి పైగా రౌడీలను తీసుకొని వచ్చి స్థలాన్ని ఆక్రమించుకొని జెసిబిలు పెట్టి చదును చేసుకుంటున్నారని వాపోయారు. తమ సమస్యను పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కన్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకూ సంపూర్ణ హక్కు ఉన్న భూమిని కబ్జాదారుల నుండి రక్షించాలని బాధితులు కోరారు.



తమ సమస్యను వివరిస్తున్న బాధితులు

పశు వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిల కొండయ్య పల్లి, పెద్దకోట్ల గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా పాడి పశువులకు, గొర్రెలకు వైద్యచికిత్సలు అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఎం స్వర్ణలత, ఎహెచ్ఎలు పెద్ద రామాంజనేయులు, చిన్న రామాంజనేయులు, మారుతి ప్రసాద్, జయరాజుతో పాటు నాయకులు కొంక నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - లేపాక్షి

వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ నరేంద్ర పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా చోళసముద్రం టోల్ ప్లాజా వద్ద ద్విచక్ర వాహన దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు వెంకటేష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల నిర్వహణకు టెండర్లు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

స్థానిక ఆర్టీసీ బస్టాండులో దుకాణాలు నిర్వహించుకొనుటకు టెండర్లను పిలుస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెజ్, నాన్ వెజ్ హోటల్‌కు, ఫ్లెక్సీ ప్రింటర్స్‌కు, కూల్ డ్రింక్ అండ్ బేకరీకు, మొబైల్ రిపేర్, కంప్యూటర్ రిపేర్, పైప్స్ గోడౌన్, ఎగ్జిబిజినెస్ సేల్స్, జిమ్ రెస్ట్ రూమ్ అండ్ స్టోరుం గదులు అద్దెకు ఇస్తున్నట్లు చెప్పారు. ఈనెల 21వ తేదీ నుండి ఫిబ్రవరి 5వ తేదీ వరకు డిపో మేనేజర్ కార్యాలయంలో టెండర్ ఫారం విక్రయిస్తున్నట్లు వివరించారు.

నేడు మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనంతరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బత్తలపల్లిలోని టిడిపి కార్యాలయంలో మండల టిడిపి కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ నెట్టెం రమణ, షేక్ మౌలా,వడ్డే బొజ్జప్ప తదితరులు మాట్లాడుతూ మండలంలోని మాల్యవంతం గ్రామంలోని అనంతఘాట్లో అనంతరెడ్డి వర్ధంతి వేడుకలు కుటుంబం సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. వర్ధంతి సందర్భంగా మాల్యవంతం గ్రామంలో గోనుగుంట్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అనంత మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలోని ప్రముఖ వైద్యులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఉత్తమ సర్పంచి అవార్డు అందుకున్న పంచరత్నమ్మ

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు సర్పంచి పంచరత్నమ్మ ఉత్తమ సర్పంచిగా అవార్డు అందుకున్నారు. ఢిల్లీలో జనవరి 26వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ఆమె అందుకున్నారు. ఈసందర్భంగా పంచరత్నమ్మ మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన కందులను మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఇందిరమ్మ కాలనీలో మండల వ్యవసాయ గోదాము నందు మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు సెంటర్‌ను వ్యవసాయ అధికారి ఓబిరెడ్డితో కలిసి టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కంపూడి నాగభూషణ, మారినేని కిరణ్ కుమార్, మండల సదాశివ, బొమ్మినేని శ్రీరాములు, వడ్డే బొజ్జప్ప, మార్క్‌ఫెడ్ సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - బత్తలపల్లి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు స్వీకరించిన అధికారులను సోమవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో నరసింహనాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ హాజరయ్యారు. అవార్డులు అందుకున్న ఎంపీడీఓ కార్యాలయ ఏవో శ్రీనివాసులు, బత్తలపల్లి పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, బత్తలపల్లి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అనిల్ కుమార్, డి.చెర్లోపల్లి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రాజారెడ్డి, ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ వీరాంజనేయులు, మాల్యవంతం సచివాలయ సెరికల్చర్ అసిస్టెంట్ లావణ్యలత, ఎంపీడీవో కార్యాలయ సబార్డినేట్ సుశీలమ్మను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వున్న అన్న క్యాంటీన్‌ను ధర్మవరం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సోమవారం పరిశీలించారు. అక్కడ కు వచ్చిన వారిని అల్పాహారం ఎలావుందని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం ప్రజలకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదా అని విచారించారు. ప్రజలందరికి మెరుగైన ఆహారం వడ్డించాలని పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు.



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్

పేరుకుపోయిన భూ వివాదాలు



రైతు సాగుచేసుకుంటున్న భూమి

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఇబ్బందుల్లో బాధితులు

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు మండలంలోని పలు గ్రామాల్లో భూ వివాదాలు పేరుకుపోయాయి. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంవల్ల సమస్యలు నెలకొన్నాయి. ఫలితంగా బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఓరువాయి పంచాయతీ పల్లె వండ్లపల్లెకు చెందిన రైతు రఘురాం సర్వేనెంబర్ 1051 నాలుగో లెటర్ కింద ఉన్న భూమిలో 15 సంవత్సరాలు వివిధ పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ భూమి పుష్పావతి అనే మహిళ పేరుమీద వన్ బి వస్తోంది. దీంతో సమస్యను రైతు రఘురాం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కన్పించలేదు. 15 సంవత్సరాలుగా బాధితుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ వ్యవహారం జరిగిందని ఇది తమ చేతిలో లేదని ఆర్డీవో పరిధిలో ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని బాధితుడు వాపోతున్నాడు. ఇదే విధంగా మండలంలోని తలమర్లపల్లికి చెందిన రఘురాం 30 సెంట్లు భూమి కోసం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే రెవెన్యూ అధికారులు ఆ వ్యక్తిని భయపెట్టి తహశీల్దార్ కార్యాలయం వైపు రాకుండా చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. బలవంతంగా అతని వద్ద పేపర్లో సంతకం పెట్టించుకుని కలెక్టర్‌కు పంపినట్లు సమాచారం. ఇదేవిధంగా గ్రామానికి చెందిన కాంతమ్మ అనే మహిళకు ఐదు ఎకరాల భూమి ఉంది. ఈ భూమి మధ్య భాగంలో బండిబాట ఉందని అదే గ్రామానికి చెందిన కొంతమంది వాదిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశారు. అయితే ఇంతవరకు రెవెన్యూ అధికారులు స్పందించలేదని బాధితులు వాపోతున్నారు. ఇలా మండలంలో పలు భూసమస్యలు నెలకొన్నాయి. వాటి పరిష్కారంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

'బ్లూమూన్' విద్యార్థికి క్రీడా సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - కదిరి టౌన్

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ వినూత్న చేతుల మీదుగా కదిరి బ్లూమూన్ విద్యార్థిని ఏం నిఖిత బాయ్ అనే విద్యార్థి క్రీడా సాఫల్య పురస్కారం అందుకుంది. ఈసందర్భంగా బ్లూమూన్ చైర్మన్ మంచి శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి ఆటలు, క్రీడలు ఎంతో అవసరమన్నారు. మెరుగైన మానసిక, శారీరక ఆరోగ్యం, మెరుగైన సామాజిక నైపుణ్యాలు, స్వీయ-విలువలతో సహా విద్యార్థులు వారి నుండి గొప్ప ఒప్పందాన్ని పొందుతారన్నారు. క్రీడలలో పాల్గొనే పిల్లలు స్వీయ-క్రమశిక్షణ, పట్టుదల, జట్టుకృషి గురించి విలువైన జీవిత పాఠాలను పొందుతారన్నారు. క్రీడలు విద్యార్థులను శారీరకంగా దృఢంగా ఉంచుతాయన్నారు. ప్రతిభా విద్యార్థిని మంచి శివశంకర్‌తో పాటు పీడీ వనజ అక్కమ్మ, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రోగ్రాం ఇంచార్జ్ కృష్ణమాచారి, సీడీపీవో శ్రీదేవి, అనంతపురం సత్యసాయి జిల్లా చైర్మన్ మురళీకృష్ణ, కరాటే మాస్టర్ షేక్షావలి, బ్లూ మూన్ కాలేజీ ప్రిన్సిపల్ తదితరులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న నిఖితబాయ్

అంగన్వాడీ కేంద్రానికి ఆటవస్తువులు అందజేత

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలో సిరివరం గ్రామంలోని అంగన్వాడీకేంద్రం, మినీ అంగన్వాడి కేంద్రాలకు దాతలు ఆటవస్తువులు అందజేశారు. జారుడుబల్ల, కుర్చీలు, టేబుల్లు లాంటి ఆట వస్తువులతో పాటు సదరు అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన కుక్కర్, ఇతర వస్తువులను ఉచితంగా సమకూర్చారు. సోమవారం హిందూపురం సిడిపిఒ శాంతి ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రం-2లో ఏర్పాటు చేసిన సమావేశంలో దాతలు తాము సమకూర్చిన వస్తువులను అంగన్వాడీ కార్యకర్తలకు అందజేశారు. అంగన్వాడి కేంద్రాలకు అవసరమైన వస్తువులను సమకూర్చటంలో కీలకంగా వ్యవహరించిన సీనియర్ అంగన్వాడీ కార్యకర్త జయప్రదను, మినీ సెంటర్ కార్యకర్త సునీతను సిడిపిఒ శాంతి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు జయ పద్మ, సునీత, గంగరత్న, శివమ్మ, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.



దాతలు ఇచ్చిన వస్తువులతో అంగన్వాడీలు, అధికారులు

ప్రయోగాత్మక విద్యను నేర్పించడం అభినందనీయం



నక్షత్ర శాలను ప్రారంభిస్తున్న ఎంఇఒ, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

రోజు రోజుకు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి పాంచజన్య బ్రిలియంట్ ఉన్నత పాఠశాల తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేందుకు ముందుకు రావడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. సోమవారం పాఠశాలలో ప్రయోగాత్మక విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన సంచార నక్షత్రశాలను ఎంఇఒ గంగప్పతో పాటు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కరస్పాండెంట్ నందకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను ఎంత విపులంగా వివరించినప్పటికీ, విద్యార్థులకు అదే అంశాన్ని నమూనాల ద్వారా, చిత్రాల ద్వారా చూపించినట్లయితే వారి మనసులో చిరకాలం గుర్తుండిపోవడమే కాకుండా ఇతరులకు కూడా తెలియజేసే స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పాఠశాలలో సంచార నక్షత్రశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూమి ఆవిర్భావం, నక్షత్రాల పుట్టుక, గ్రహాల కదలికలు, సూర్యచంద్రుల ప్రభావము, గ్రహణాల ప్రభావము, ఇస్రో పనితీరు, తయారీ విధానము, విశ్వంలో జరిగే అద్భుతాలను కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తూ మరో లోకంలో సంచరిస్తున్నామా అన్న అనుభూతిని విద్యార్థులలో కలుగజేసే రీతిలో ఈ నక్షత్రశాలను రూపొందించడం జరిగిందన్నారు. 1 వ తరగతి నుండి 10వ తరగతి వరకు వారి స్థాయి బట్టి పాఠ్య విషయాలను వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయిత్రి, పరిపాలన అధికారి భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, సహ ప్రధానోపాధ్యాయులు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇవిఎం కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డులో వున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కలెక్టర్ టిఎస్. చేతన్ సోమవారం పరిశీలించారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఒ మహేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నటరాజ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ధర్మవరం టౌన్ :పట్టణంలోని నూతన ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ చేతన్ తనిఖీ చేశారు. డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలను, పంపిణీ చేస్తున్న మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటిదాకా 21 మంది రోగులు డయాలసిస్ కోసం నమోదు చేసుకున్నారని, ప్రస్తుతం 16 మందికి డయాలసిస్ చేశామని ఆమె కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ మెడికల్ ఆఫీసర్ అభిలాష్, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పుట్టపర్తి పట్టణంలోని గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు వాల్మీకి సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ గేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణమూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచే వాల్మీకులు వేట వృత్తితో జీవనం సాగించేవారన్నారు. వాల్మీకి బోయ కులస్తులకు ఎటువంటి ఆర్థికవనరులు లేవని గుర్తించిన అప్పటి ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చి ఉపాధి కలిగించడం జరిగిందన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా వాల్మీకులు ఎస్టీ జాబితాలోనే కొనసాగారని గుర్తుచేశారు. ఒక ప్రభుత్వం చేసిన కుట్రలో భాగంగా వాల్మీకులను ఎస్టీ నుంచి బీసీ జాబితాలోకి మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకి సంఘాలు ఉద్యమాలు చేయడంతో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇచ్చిందనితెలిపారు. కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు ఒఆర్‌జిఐ అభ్యంతరాలను తిప్పికొట్టి వాల్మీకి సమాజానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అంజనాదేవి, సురేష్ బాబు, కృష్ణ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగేశ్వరి, నల్లమాడ అధ్యక్షురాలు సుజాత, పుట్టపర్తి నాయకులు శ్రీరాములు,శంకర, ఓడిసి అధ్యక్షుడు ఆదినారాయణ, ఆనంద్,తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కృష్ణా జలాలతో నింపండి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మడకశిర మండలంలోని హరేసముద్రం మడకశిర చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణ జలాలను నింపాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. మడకశిర చెరువుకు 700 ఎకరాలపైగా ఆయకట్టు భూమి ఉంది.అలాగే హరే సముద్రం చెరువుకు 900 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. హంద్రీనీవా కాలువ ద్వారా ఈ చెరువులకు నీరు నింపడం వలన దాదాపుగా ఏడు కిలోమీటర్ల నుండి పది కిలో మీటర్ల వ్యాప్తంగా భూగర్భ జలాలు పెరిగాయి. ఒక్కసారి కాలువల ద్వారా చెరువుకు నీరు వదిలితే దాదాపు సంవత్సర కాలం పాటు ఆ పరిధిలో ఉన్నబోరు బావుల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయి. సకాలంలో చెరువులకు నీటిని వదలాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా గొట్లూరు అనాథ ఆశ్రమంలో గొట్లూరు ప్రయివేట్ విద్యుత్ కార్మికులు సోమవారం వద్దులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో కార్మికులు ఎస్.రాముడు, కొండప్ప, రవి, రాజా, పెద్దన్న, యల్లప్ప, నాగరాజు, రామాంజి, మస్తాన్, పోతలయ్య బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వరండాలోనే అంగన్వాడీ కేంద్రం నిర్వహణ

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని పరాకువాండ్లపల్లిలో ఆరునెలలుగా వరండాలోనే అంగన్వాడీకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవటంతో గతంలో పాఠశాలలో నిర్వహించేవారు. అయితే పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ పాఠశాల వరండాలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పర్యవేక్షణ కూడా సరిగా లేదన్న విమర్శలు ఉన్నాయి. సిడిపిఒ ఇంతవరకు ఈ కేంద్రాన్ని తనిఖీ చేసిన దాఖలాలు లేవని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రం సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వరండాలో కూర్చొన్న చిన్నారులు

నేరాలు ఘోరాలు

కుక్కలదాడిలో 14గొర్రెలు మృతి

ప్రజాశక్తి - మడకశిర

మండలంలోని తురకవాండ్లపల్లి గ్రామంలోని గొర్రెల కాపరి ఈరప్ప కుమారుడు తిప్పన్నకు చెందిన 14 గొర్రెలు కుక్కల దాడిలో మృతిచెందాయి. దీంతో తనకు 60వేల రూపాయల వరకు నష్టం జరిగిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



మృతిచెందిన గొర్రెలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రమైన బత్తలపల్లిలో బొలెరో వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓబులేసు కుమారుడు అరిగల రాంబాబు సోమవారం ధర్మవరానికి వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో వెళ్లాడు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెలుతున్నాడు. బత్తలపల్లి వైపు నుంచి ధర్మవరం వెలుతున్న బొలెరో వాహనం ఉన్నపలంగా ఆటో గ్యారేజీలోకి తిప్పడంతో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.

కొత్తచెరువు వద్ద ప్రమాదంలో మరో వ్యక్తికి...

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్త చెరువులోనే బుక్కపట్నం రోడ్డులోని అక్కమ్మ గారి కొండ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మస్తాన్ అనే వ్యక్తి కొత్తచెరువు నుండి ద్విచక్ర వాహనంలో బుక్కపట్నం వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మస్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఇందిర తెలిపారు.

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు సోమవారం తనిఖీ చేశారు. డిసి నాగ ముద్దయ్య, అసిస్టెంట్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ మునిస్వామి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులు తదితరులు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్లోని కేసుల వివరాలు,పెండింగ్ కేసులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం ,నాటు సారా, కర్నాటక మద్యం సరఫరాకు అడ్డుకట్టు వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ నాగరాజు, ఎస్ఐ మనోహర్ రాజు, సిబ్బంది ఉన్నారు.

నవజాత శిశువు మృతదేహం లభ్యం..

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలోని పంట పొలాలకు వెళ్లే ప్రధాన కాలువలో నవజాత శిశు మృతదేహం లభ్యం అయింది. సోమవారం కాలువలో నవజాత శిశువు మృతదేహం కనిపించడంతో స్థానికులు ఐసిడిఎస్ అధికారులకు సమాచారం అందించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌసల్య సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి మడకశిర

మడకశిర నియోజకవర్గంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎంపి పార్థసారధి కోరారు. ఈ మేరకు వారు సోమవారం అమరావతిలోని సచివాలయంలో రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మడకశిరకు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

జైన్ పాఠశాల విద్యార్థినికి అవార్డు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని జైన్ సీబీఎస్ఈ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కీర్తన అనే విద్యార్థిని కలెక్టర్ చేతన్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కార అవార్డు అందుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయ గుప్తా మాట్లాడుతూ విద్యార్థిని కీర్తన అక్టోబర్ నెలలో సీబీఎస్ఈ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన "వీర గాథ 4.0 " జాతీయస్థాయి పెయింటింగ్ పోటీలలో పాల్గొందన్నారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపర్చినందున అవార్డును, ప్రశంసా పత్రాన్ని కీర్తన అందుకున్నట్లు చెప్పారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయండి : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చట్ట పరిధిలోని ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ రత్న సూచించారు.జిల్లా పోలీస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఆమె ఫిర్యాదులను స్వీకరించారు. పిటీషన్ల పై వాస్తవాలను విచారించి చట్టపరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, ఎస్‌బి సి ఐ బాలసుబ్రమణ్యం రెడ్డి , సిబ్బంది ఉన్నారు.

బాలయ్య అభిమానుల సందడి

ప్రజాశక్తి - చిలమత్తూరు

హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలక్రిష్ణ కు పద్మభూషన్ రావడాన్ని హర్షిస్తూ సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తెలుగుదేశం నాయకులు అభిమానులు బాణాసంచి కాల్చి,కేక్ కట్ చేసి వేడుక చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమం లో టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ గంగాధర్, గౌరిశంకర్, నందీషప్ప, విశ్వనాథ్, మల్లికార్జున, శ్రీదేవి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



టిడిపి నాయకుల సంబరాలు

అసంక్రమిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అసంక్రమిత వ్యాధులపై అవగాహన సర్వే కార్యక్రమాన్ని పుట్టపర్తి ప్రాథమిక వైద్య సిబ్బంది సోమవారం నిర్వహించారు. సర్వే కార్యక్రమంలో భాగంగా జగరాజుపల్లిలో డాక్టర్ నివేదిత పర్యటించి అసంక్రమిత వ్యాధులపై పరీక్ష చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమములో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, లలితకుమారి, సూపర్ వైజర్ వెంకట రమణ , ఎంహెచ్‌పి అపర్ణ, ఆరోగ్య కార్యకర్త ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న వారికి పలువురు అభినందనలు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేష్, రైతు సంఘం కార్యదర్శి పోతులయ్య ,అవాజ్ కమిటీ కార్యదర్శి బాబ్జాన్, సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, తిప్పయ్య తదితరులు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.